

# స్వామిద్రోహి అను మనిషి తదా అవినీతి కథ

క్రోవి రామమోహన శాస్త్రి

వలయాలుగా పైపైకి పోతున్న చుట్ట పొగలోకి చూస్తూ రెండు క్షణాలు మౌనంగా వుండిపోయేడు గంగరాజు.

పాలేరు పోలయ్య అంతసేపూ యజమాని వైపు కళ్ళార్పకుండా చూస్తూనే వున్నాడు. ఆయన వాలకం చూస్తూ—ఈయనేదో భూమికీ ఆకాశానికీ నిచ్చెన వేసేసేలా కనిపిస్తున్నాడు—అనుకున్నాడు పోలయ్య. ఏదేనా వ్యూహం పన్నేటప్పుడు యజమాని వాలకం ఎలా వుంటుందో అతనికి బాగా తెలుసు.

"పోలయ్యా!" అని పిలిచేడు గంగరాజు.

"అయ్య!" అన్నాడు పోలయ్య వినయంగా.

"నీకు సంతకం పెట్టడం చేతొచ్చుగా?" అని ప్రశ్నించేడు గంగరాజు.

"అలాగేనండయ్య! సెయ్యొచ్చుకుద్దండీ" అన్నాడు పోలయ్య సిగ్గుపడిపోతూ.

"వెధవ ఒణుకు! పోనీరా! సంతకం చెయ్యటం చాతవును గదా! అది చాలు!" అన్నాడు గంగరాజు విసుగ్గా.

"చాతవుద్దండి!" అన్నాడు పోలయ్య.

గంగరాజు మళ్ళా చుట్ట పొగ పీల్చి, బూడిని చిటికెన వేలితో కింద దులిపేడు. పోలయ్యని ఆపాదమస్తకం ఓసారి చూసుకుని తృప్తిగా నిట్టూర్చేడు.

"పోలయ్యా! ఈ దెబ్బతో నర్సిగాణ్ణి శంకరగిరి మాన్యాలు పట్టించాల్రా!" అన్నాడు కసిగా.

"ఏ నర్సిగాడయ్యా!" అనడిగేడు పోలయ్య అమాయకంగా. నర్సయ్యలు, నరసింహారావులు, నరసింహాలు, నర్సిగాళ్లు ఊళ్ళో చాలామంది వుండటంవల్లా, అందులో కొంతమందితో తన యజమానికి విరోధం ఉండటంవల్లా, ఆయన మాట్లాడేది ఏ నర్సిగాణ్ణి గురించో ఊహించలేక పోయేడు, పోలయ్య.

"వాడేరా, మీ బామ్మరిది. ఎవడు? మీ వీధిలో నా కాండేటుగా నిలబడి, పంచాయితీబోర్డు మెంబరయ్యేడే, ఆ వెధవ! ద్రోహి!" అన్నాడు గంగరాజు గొంతు పెంచి!

పోలయ్య గుండెల్లో రైళ్ళు పరిగెత్తేయి! గతం అతని కళ్ళముందు-కాఫీ

కర్పు కంట చూడని ఆఫీసు గుమాస్తాల చేతుల్లో రంగులరాట్నం తిరిగే సామాన్య మానవుడి అప్లికేషన్‌లాగా-తిరిగిపోయింది!

రెండేళ్ళ క్రితంవరకూ, అంటే గంగరాజుగారి ప్రెసిడెంటు పదవికి ఉద్వాసన జరక్క ముందువరకూ ఆయన ఆరో ప్రాణం నర్సిగాడు. ఎలాంటి భయంకర రహస్యమైనా నర్సిగాడి చెవిన పడెయ్యకుండా ఉండేవాడు కాడు గంగరాజు. వైస్ ప్రెసిడెంటు కాకపోయినా, గంగరాజు పదవిలో ఉన్నంతకాలం, అంత హోదానూ వెలగబెట్టేడు నర్సిగాడు. గంగరాజు కొలువులో నర్సిగాడు ప్రధానమంత్రి! పోలయ్య మాత్రం ద్వారపాలకుడు! కాలమనేది ఎమ్మెల్యేల పార్టీల మార్పిడికన్న చంచలమైనదని ఎవరనుకుంటారు? అనుకోలేదు గనకే గంగరాజు బండ్లు ఓడలై, ఓడలు బండ్లు అయ్యేయి. కంట్రాక్టుల విషయాల్లో రానివ్వండి, కమీషను వ్యవహాగాల్లో గానివ్వండి, వాటాలు తెగక పంచాయితీ బోర్డు మెంబర్లలో అనుకోకుండా ముసలం పుట్టింది. ఇహ ఫలితం గురించి పెద్దగా వర్ణించేందుకేముంది? రహస్య సమావేశాలూ, 'కోల్డువార్సూ' ఎడాతెరిపీ లేకుండా కొన్నాళ్ళు సాగి, చివరికి గంగరాజు మీద అవిశ్వాస తీర్మానం పెట్టేంత వరకూ దారితీసేయి! కారణం తెలీదుగాని నర్సిగాడు ఉన్నట్లుండి, గంగరాజు కొలువు మానేసి, ఆయన పరమశత్రువు సింహాద్రిని ఆశ్రయించటం, అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటువేసి, గంగరాజు పదవీచ్యుతికీ, సింహాద్రి పదవీస్వీకారానికీ ముఖ్యకారకుడై పోయేడు. కొంచెం అందంగా (?) చెప్పాలంటే గంగరాజు కోరలు పీకిన ధీరుడు గూడెంలో మొట్టమొదటి పంచాయితీ బోర్డు మెంబరు నర్సిగాడు.

నర్సిగాడు చేసిన ద్రోహానికి గంగరాజు హృదయంలో క్రోధాగ్ని దారుణంగా ప్రజ్వరిల్లింది! ప్రజలెన్ని తిట్టినా పదవి దిగటాని కిష్టంలేకా, తిట్టిన వాళ్ళమీద ప్రతీకారం తీర్చుకునే దమ్ములేకా, లోలోపలే కుళ్ళిపోతూ, సమయంకోసం ఎదురుచూసే ప్రజానాయకుడిలా తయారయ్యేడు గంగరాజు. ఊరుకున్నాడు. అరకాదు, ఒకటి కాదు. రెండేళ్ళు. అంటే మళ్ళీ పంచాయితీ ఎన్నిక లొచ్చేంతవరకూ!

పై సంఘటనలన్నీ పోలయ్యకి గుర్తొచ్చేయి. అయితే ఇంతకాలం తర్వాత— యజమాని-నర్సిగాడి దుర్మార్గాన్ని గురించి ప్రత్యేకంగా తనతో ఎందుకు చెపుతున్నాడో అతనికి అర్థంకాలేదు.

"నిజమండయ్యా! శానా దురుమారగం సేసేడండయ్యా నర్సిగాడు! ఛీ! యదవ జలమం!" అన్నాడు. ఆత్మాభిమానాన్నీ, తెలివితేటల్నీ, సమర్థతనీ, కడుపుకోసం అమ్మేసుకుని, గాజులు తొడుక్కుని ఓ మూల కూచుని జపంచేసుకుంటున్న మన భారతీయ మేధావుల్లాగే అన్నాడు. తేడా అల్లా పోలయ్య నిరక్షరకుక్షి. శ్రమించి, కడుపు నింపుకోవటమనే యుగయుగాల

శతవృద్ధాచారాన్ని తు. చ. తప్పకుండా ఆచరిస్తున్నవాడు!

"మెల్లిగా అంటావేమిట్రా? పేద పోగేసుకునే వెధవకోసం, అంత డబ్బు ఖర్చుపెట్టి ఎలక్షన్లలో నిలబెట్టి, గెలిపించాననే విశ్వాసం కూడా లేని నీచుడ్రా వాడు! వాణ్ణించేస్తే పాపం ఉంటుంది? వాడిలాంటి వాళ్ళే దేశానికి చీడపురుగుల్రా!" అన్నాడు గంగరాజు ఈసడింపుగా!

ఆ క్షణంలో పోలయ్యకి యజమాని మాటల్లో పొల్లు మాటలేం కనిపించలేదు. కారణం అతనికి కొన్ని నమ్మకాలంటూ వున్నాయి. నీతీ, నిజాయితీ, స్థిరచిత్తం మనిషికి ఎంతో అవసరమనే సిద్ధాంతం, ఏనాడో అతనిలో దృఢంగా నాటుకుపోయింది. తాత్కాలిక ప్రయోజనాలకు ప్రలోభపడి నమ్మినవాళ్ళకి ద్రోహం చెయ్యటం 'దేవుణ్ణి' ధిక్కరించటమే అని అతని అభిప్రాయం. ఒక్కోసారి పోలయ్య ఆలోచిస్తూ వుంటాడు. దేశంలో ఎంతో మంది, ఇలాంటి ధిక్కారాలు చీటికీమాటికీ చేస్తూంటే 'దేవుడు' ఎందుకు వూరుకుంటున్నాడా అని!

"ఏవిట్రా ఆలోచన?" అని అడిగేడు గంగరాజు.

"ఏం లేదండయ్యా!" అన్నాడు పోలయ్య.

"అదిగాదురా పోలయ్యా! అసలు కిందటిసారి ఎన్నికలకి నిన్నే నిలపెట్టాలనుకున్నాను! కాని నర్సిగాడు నీ బామ్మరిది, మనవాడూ, అని అంత డబ్బు ఖర్చుపెట్టేను. ఇంత కుళ్ళుబుద్ధి వాడిలో ఉంటుందని తోస్తే నిన్ను వదిలేసేవాడినే కాదురా!" అన్నాడు గంగరాజు. క్షణకాలం మౌనంగా వుండి, "చూడు పోలయ్యా! ఏది ఏమైనా, ఈసారి నా తరపుమనిషిగా మీ గూడెంలో నువ్వు నిలబడాలి! నర్సిగాడి పొగరణచాలి! అది నువ్వు నిలబడితేనే సాధ్యం!" అన్నాడు.

పోలయ్య గుండెల్లో రాయి పడింది!

"నే నాండయ్యా?" అన్నాడు నిర్ఘాంతపోయి.

"నువ్వేరా! ఏం? నువ్వు నర్సిగాడికంటే ఏ విషయంలో తక్కువ? వాడొట్టి వేలిముద్దరగాడు! నీకో, సంతకం చెయ్యటము చాతనవును! గూడెంలో నర్సిగాడికున్నంత పలుకుబడి నీకూ వుంది, నాకు తెలుసు! నువ్వు నిలబడ్డావా, వాడిహ సోదిలోకి కూడా రాడు!" అన్నాడు గంగరాజు బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తూ.

"నా కెందుకండయ్యా ఈ ఎన్నికలు? ఒట్టి గొడ్డెదవని!" అన్నాడు పోలయ్య!

"ఏడిశావ్! నువ్వు పోటీ చెయ్యాలి! తప్పదు. నర్సిగాడు నాకు చేసిన ద్రోహానికి ప్రతీకారం చేసి తీరాలి! లేకపోతే నా పేరు ప్రతిష్ఠలు గంగలో కలిసిపోతాయి! నర్సిగాడు పడిపోయాడంటే సింహాద్రి కోరలు విరిగినట్లేరా! నడమంత్రపు పదవిరాగానే సింహాద్రిగాడికి కొమ్ములు మొలిచేయిరా ఒరేయ్! పోలయ్యా నీకు తెలుసో లేదో

గాని, ఏ డెనిమిదేళ్ళ క్రితంవరకూ—ఆ బద్మాష్ నా పొలం కౌలుకి చేసి కడుపు నింపుకున్న దిక్కుమాలిన వెధవే గదరా! ఇప్పుడంటే ఇంత సంపాయించేడుగాని!'' అన్నాడు గంగరాజు, సింహాద్రి మీది కసి అంతా కక్కేస్తూ!

''అది కాదండయ్యా నా బాద! నర్సి గాడు సాయంగా నా ఇంటిదానికి అన్న! నా కిన్న పెద్దోడు! ఆడి కెతిరేకంగా నిల బడితే అయినోళ్ళూరుకుంటారాండయ్యా! నోట్లో గడ్డెట్టరూ'' అన్నాడు పోలయ్య!

''ఏడిశారు వెధవలు! ఎన్నికలకీ, బంధుత్వానికీ సంబంధ మేవిట్రా? దేని దారి దానిదే! అలా అనుకుంటేనే పైకొస్తాం! పైకి రావాలనుకునే వాళ్ళు అటువంటాలో చనలు చెయ్యకూడదురా! చూడు! నువ్వు గెలిచేవరకూ ఊరుకో! గెల్చాకంటావా? ఈ తిట్టిన వాళ్ళంతా నీ చుట్టూ కుక్కల్లా తిరగరూ '' అన్నాడు గంగరాజు.

పోలయ్య మనస్సు నర్సిగాడింటి వంక చూస్తోంది. నర్సిగాడింటికి గూడెంలోని చిన్నా పెద్దా ప్రతిరోజూ అయిన విషయానికీ, కాని విషయానికీ ఎస్తూపోతూన్న దృశ్యం కనిపించేసరికి—నర్సిగాడు —చూస్తూండ గానే ఎంత ఎదిగిపోయేడు—అనిపించింది అతనికి. పోలయ్యలో ఏదో అవ్యక్తమైన ఉత్తేజం తొంగిచూసింది. యజమానిమాట పాటిస్తే బావుండుననే కోరిక పెర పెర లాడింది. ఆ వెను వెంటనే 'నువ్వాట్టి శాతగానోడివి మావాఁ! నాతో సెప్పకుండా దేంటో తలెట్టమాక! సెడిపోతావ్!' అని పదేపదేసార్లు చెపుతూండే లచ్చి గుర్తొచ్చిం దతనికి.

''ఆలోసిస్తా నండయ్యా!'' అన్నాడు పోలయ్య ఎటూ చెప్పలేని అయోమయా వస్థలో వుండి!

''కాదనిమాత్రం చెప్పకురా పోలయ్యా! పొద్దుపోయింది, యింటికి పో!'' అంటూ గంగరాజు ఆరిపోయిన చుట్టని దూరంగా విసిరేసి లోపలికి వెళ్ళిపోయేడు.

పోలయ్య ఆలోచనలతో యింటివైపు సాగాడు.

*　　　　*

రాత్రి తొమ్మిది దాటింది.

పూరికొంపలో గుడ్డిగా వెలుగుతోన్న కిరసనాయిలు దీపం మీదే దృష్టినిలిపి, బీడీ కాలుస్తూ మంచం మీద కూచున్న పోలయ్య వంక ఆశ్చర్యంగా చూసింది లచ్చి.

''ఏంటి మావాఁయ్ ఆలోచన'' అన్న దామె తల్లో మల్లెపూల దండ తురుము కుంటూ.

''ఏవుఁందే! అదే ... ...అయ్యగోరు సెప్పిన సంగతి....'' అన్నాడు పోలయ్య.

''పోటీ శాద్దావఁనుందా'' అని అడి గింది లచ్చి గుమ్మంలో తలుపు కానుకుని కూచుంటూ.

''అయ్యగోరు మరీ మరీ సెప్పేరే! ఏం జెయ్యమంటావ్?'' అనడిగేడు పోలయ్య.

''మన్లాంటోల్ల కెందుకు మావాఁ అయ్యన్నీ? ఆల్లు పెద్దోల్లు!'' అన్నది లచ్చి.




పోలయ్య ఓ నిమిషం మౌనంగా వుండి, "మీ అన్న మాత్తరం మన్లాంటోడు కాదేంటే?" అన్నాడు.

"ఆడి సంగతెత్తమాక! ఆడుట్టి బుర్ర తక్కువ సన్నాసి. సేసే పన్లన్నీ యదవ పన్లే మావా! ఆ ఎలచ్చన్లో గెలిసిన కాణ్ణుంచీ ఒక గంటసేపైనా ఇంటికాడుంటన్నాడా? ఒదిన కేసి సూత్తన్నాడా? బుద్ధిలేనెదవ! పొద్దల్లా తాగేసి దాన్ని సితకదంతాడు! ఆడి బతుకు సెడ!" అన్నది లచ్చి కోపంగా!

"నేనూ అట్టాగైపోతానని బయపడతన్నావేంటే?" అన్నాడు పోలయ్య చిరునవ్వుతో.

లచ్చి బరువుగా నిట్టూర్చింది.

"అగ్గిలాంటి ఈరన్న కొడుకు నర్సిగాడు తాగుమోతవుతాడని ఎవురనుకున్నారు మావా? ఈ ఎలచ్చన్లకి ముందు ఆడు ఎంత మంచోడు? ఇప్పు డెట్టాగయ్యేడు! ఎలచ్చన్లు మడిసిని సెడిపేయే మావా! నా మాటిను! మంచిగా బతికితే సాల్దా మనకి?" అన్నది బ్రతిమాలుతోన్న ధోరణిలో!

పోలయ్య మౌనంగా మంచం మీద వెనక్కి వాలేడు! తలుపులు మూసి, దీపం కొంచెంగా తగ్గించి, మంచం మీద కూచుంటూ, "కూసంత జరుగు మావా!" అన్నది లచ్చి తియ్యగా!

* *

"దండాలు బాబూ!" అంటూ వినయంగా చేతులు జోడించేడు పోలయ్య.

ఏదో పుస్తకం తిరగేస్తూ, పీదరుగు మీద కూచునున్న ఆ వూరి ఎలిమెంటరీ స్కూలు టీచరు సుందర్రావు తలెత్తి చూసేడు. చిరునవ్వు నవ్వేడు.

"బావున్నావా పోలయ్యా! ఈ మధ్య ఎక్కడా కనిపించటం లేదు!" అన్నాడు ఆప్యాయంగా.

"పల్లపు సేలో కెల్తన్నా బాబూ ఈ మద్దెన! ఎసులు బాటపటం లేదు!" అన్నాడు పోలయ్య.

"అలానా! అలా కూచో! ఏదేనా పని మీద వచ్చేవా?" అనడిగేడు సుందర్రావు.

"పనేం లేదు బాబూ! అయ్యగోరు కబురెడితేను. .. .తవుర్ని దోపరో సూసెల్లొచ్చని ఇటేపొచ్చేను!" అంటూ అరుగు మూలగా కూచోబోయిన పోలయ్య దృష్టి... నట్టింట్లో సర్దిపెట్టిన సామానుల మీద పడింది!

"ఏంటి బాబూ! సామానంతా సరిదేసేరు?" అనడిగేడు పోలయ్య తెల్లబోయి.

"అవును పోలయ్యా! నే నీ వూర్నుంచీ మకాం ఎత్తేస్తున్నాను!" అన్నాడు సుందర్రావు.

"బదలాయింపయిందేంటి బాబూ!" అన్నాడు పోలయ్య. ఆ ఆలోచన అతనికి చాలా బాధాకరంగా వుంది. సుందర్రావుది కొండూరు. పోలయ్య పింతండ్రి కూడా ఆ వూళ్ళోనే చాలా కాలంనుంచీ ఉంటున్నాడు. సుందర్రావు పరిచయమైన కొత్తల్లోనే పోలయ్యకీ వివరాలన్నీ తెలిసేయి. అప్పట్నుంచీ పోలయ్యకి సుందర్రావు ఎంతో ఆత్మీయుడయ్యేడు. అందుకే పోలయ్య బాధపడుతున్నాడు.

"అదేంకాదు పోలయ్యా! నేను ఉద్యోగానికి రాజీనామా చేసేను" అన్నాడు సుందర్రావు సాలోచనగా!

సుందర్రావుది బాగా కలిగిన కుటుంబం కాదు. అలాని పూర్తిగా లేనివాడేమీ కాదు! అతనూ, అతని అన్నా పంచుకుంటే చెరో ఏడెనిమిదెకరాల మాగాణీ వస్తుంది. సుందర్రావు ఎస్సెస్సెల్సీదాకా చదివి బడిపంతులు ట్రెయినింగ్ అయ్యేడు. అసలు సుందర్రావుకి బడిపంతులు ఉద్యోగం చేద్దామనే కోరిక లేనేలేదు ఏ కోశానా! మారుతోందనీ, అభివృద్ధి చెందుతోందనీ నాయకులు ఉపన్యసించే తేలిక సబబైన ఈ సమాజంలో ఆ ఉద్యోగానికీ,దాన్ని చేసేవాడికీ ఉన్న విలువ చాలా తక్కువని అతనికి తెలుసు! అయితే అతని అన్నగారు చిన్నప్పుడే వ్యవసాయంలో దిగి చదువుకి కరారావుడి చుట్టేసేడు. అందుకే కనీసం తమ్ముడన్నా చదువుకుని ఉద్యోగంలో చేరితే నలుగురిలో కాస్త గౌరవం దొరుకుతుందని ప్రోత్సాహం కలిగించేడు. అసలు సుందర్రావుకి కాలేజీలో చదవాలని వుండేది. కాని, అనివార్య కారణాలవల్ల అది సాగింది కాదు. మిత్రుల సలహా మీద, అన్నగారి పట్టుదలవల్లా, యిష్టంలేకపోయినా ఆ మార్గాన్ని అనుసరించేడు. అది పూర్తి కాగానే ఉద్యోగంకోసం ప్రయత్నించమని

అన్నగారు కోరినప్పుడు కాస్త తటపటాయించేడు.

"వ్యవసాయమంతా నీ కొదిలి నేనెక్కడో ఉద్యోగంలో చేరమంటావుట్రా?" అన్నాడు సుందర్రావు.

"తప్పేముంది? ఎలాగా నాకీ పని తప్పేది కాదు. నువ్వు కాస్తో కూస్తో చదివేవు! చదువుకు తగిన ఉద్యోగం చెయ్యకపోతే చదివిన ఫలిత మేముందిరా?" అన్నాడు అన్నగారు.

సుందర్రావు అభిప్రాయం వేరు. తనకు కొద్దో గొప్పో కొంప్ర వుంది! సొంత యిల్లుంది. అన్నతోపాటు వ్యవసాయం చేస్తే ఖర్చు కలిసొస్తుంది, ఆదాయమూ పెరుగుతుంది. పైగా తనకి ఉద్యోగం చేస్తేగాని యిల్లు గడవదన్న బెంగ లేదు. సంఘంలో ఆ ఉద్యోగంమీదే ఆధారపడి తపించే వాళ్ళెందరో ఉన్నారు. ఆ నిర్భాగ్యులే ఉద్యోగాలకోసం ఒకరితో ఒకరు పోటీపడి ఛస్తుంటే—కాస్తో కూస్తో వున్నవాడు కూడా వాళ్ళకి పోటీ నిలవడం మానవత్వం అనిపించుకోదని సుందర్రావు అభిప్రాయం. ఈ మాటే అన్నగారికి చెప్పినప్పుడు, ఆయన దగ్గిర్నుంచి ఓ చిరునవ్వు, దాంతోపాటే వ్యంగ్యాత్మకమైన జవాబు రావడంతో సుందర్రావుకి బడిపంతులు పని తప్పలేదు. అన్నగారిని పూర్తిగా వ్యతిరేకించలేని బలహీనుడై పోయేడు.

"ఎందుకు సేసేరు బాబూ?" అన్న పోలయ్య ప్రశ్న సుందర్రావుని ఆలోచనల్లోంచి మేల్కొలిపింది! ఓ నిముషం పోలయ్య ముఖంలోకి నిశ్చలంగా చూసేడు.

"పోలయ్యా! ఒక్క విషయం చెప్పేదా? నిజానికి నేనీ ఉద్యోగం చెయ్యకపోయినా నా పొట్ట గడుస్తుంది. అయినా అన్నయ్య మాట కాదనలేక చేరేను. చేరినప్పట్నుంచీ నా మనస్సుకి శాంతి లేదు. నీకు తెలిసే వుంటుంది. మన సోమయాజులు మాష్టారి కొడుకు శాస్త్రి....మూడేళ్ళనుంచీ ఈ బడిపంతులు ఉద్యోగం కోసం ఎంత బాధపడుతున్నాడో! తండ్రి ఆ వృద్ధాప్యంలో పైత్రివేట్లుచెప్పి సంపాయిస్తుంటే కూర్చుని తినవలసి వస్తోందని ఎంత కుమిలిపోతున్నాడో! అతనే కాదు ... . ఈ దేశంలో అలాంటి నిర్భాగ్యులెంతో మంది వున్నారు. నాలా కొద్దో గొప్పో ఆస్తి వున్న వాళ్ళీ ఉద్యోగాలొదిలేసి ... ...అలాంటి వాళ్లకి చోటిచ్చి.......ఆదుకోవడం మానవధర్మం కాదా?" అన్నాడు ఆవేశంతో!

"శాస్తుర్లుగోరికి యిప్పించేందుకే నేంటి బాబూ తమరీ ఉద్యోగం వదిలేస్తున్నారు?" అనడిగేడు పోలయ్య.

పేలవంగా నవ్వేడు సుందర్రావు.

"అది నా చేతుల్లో లేదు పోలయ్యా! కాని, నాకలాంటి కోరిక వుంది. ఇది న్యాయమైన కోరికే అయినా, ప్రస్తుతం న్యాయానికి లోకంలో చోటులేదు! ఎక్కడ చూసినా దగా, మోసం లంచగొండి తనం! ఆశ్రిత పక్షపాతం! నిర్భాగ్యుల జీవితాలు మలారంలో గాజులై పోయేయి. నేనేకాదు!

ఎవరూ ఏం చెయ్యలేరు! కాలమే మార్గం చూపించాలి!... ఈ మధ్య మా అన్నయ్య ఆరోగ్యం సరిలేదు. వ్యవసాయం చూసేందుకు ఎవరూ లేరు! అందుకే ఈ నిర్ణయాని కొచ్చేను. మరో ఆధారమంటూ లేని..... అర్హతగల పేదవాడికీ ఉద్యోగం వస్తే నాకెంతో తృప్తి!" అన్నాడు సుందర్రావు బరువుగా.

పోలయ్య లోలోపలే బాధ పడ్డాడు. మంచీ చెడూ చెప్పుకునేందుకు తన భాష అర్థంచేసుకోగల వ్యక్తి అకస్మాత్తుగా దూరం కావడం అతని గుండెల్లో గునపంలా గుచ్చుకుంటోంది! అతన్ని వెళ్ళొద్దని చెప్పటానికి తనేమీ కాననుకున్నప్పుడు పోలయ్య కళ్ళు నీళ్లతో నిండేయి.

"నన్ను మర్శిపోకండి బాబూ! గొడ్డెదవని!" అన్నాడు పోలయ్య కంపిత స్వరంతో.

"అదేమిటి పోలయ్యా! చూడు .. ... ప్రపంచంలో మనిషికి కావలసిందేమిటి? మంచితనం! అది నీ సొమ్ము! అందుకే ఎక్కడవున్నా నువ్వు నాకు గుర్తుంటావ్!" అన్నాడు సుందర్రావు.

"బాబూ! మా అయ్యగోరు నన్ను ... నర్శిగాడి కెతిరేకంగా వచ్చే పంచాయితీ ఎలచ్చన్లో నుంచోమంటన్నారు! ఏం జెయ్‌మంటారు బాబూ!" అనడిగేడు పోలయ్య ఉండబట్టలేక. అసలు పోలయ్య సుందర్రావు దగ్గిరకొచ్చిన కారణం కూడా అదే.

తెల్లబోయేడు సుందర్రావు. గంగరాజు ఎన్నికల చదరంగానికి—పోలయ్య— మంచికీ, మానవత్వానికీ, అమాయకత్వానికీ ప్రతిబింబమైన పోలయ్య ఓ పావు కాబో తున్నాడన్న విషయం క్షణంలో పసిగట్టేడు. గూడెంలో ఇంతకాలంగా అవిచ్ఛిన్నంగా విస్తరించిన ఐక్యతకి చరమదశ సంప్రాప్తమౌతున్నదని కూడా అతనికి అర్థమైంది. భూస్వాములు, కోటీశ్వరులూ తమ పదవీ వ్యామోహానికి పోలయ్యలాంటి అమాయకులను వినియోగించుకుంటూన్న ఈ పరిణామం అతనికి ఎంతో బాధ కలిగించింది. అయినా ఆ భయంకరమైన వరద వెల్లువను ఎవరాపగలరు? నిట్టూర్చేడు, సుందర్రావు.


"నీకెలా తోస్తే అలా చెయ్యి పోలయ్యా! ఒకళ్ల అధికారానికీ, స్వార్థానికీ నీ స్వేచ్ఛని మాత్రం అమ్ముకోకు. నీలోని మంచి చచ్చిపోకండా చూసుకో! .." అని యింకేదో చెప్పబోతున్న సుందర్రావు ఆగిపోయేడు "పంతులూ!" అన్న అరుపు విని.

"ఏం నరసయ్యా? పనిమీ దొచ్చేవ్?" అని ప్రశ్నించేడు సుందర్రావు పంచాయితీ బోర్డు మెంబరు నర్సయ్యని (నర్శిగాణ్ణి) చూసి.

"మా పెద్దోణ్ణి గొడ్డును బాదినట్లు బాదేవంటెందుకయ్యా?" అని గర్జించేడు నర్శిగాడు.

"అంతచేటు కొట్టలేదే! పక్క కుర్రాడి పెన్సిలు కాజేస్తే తప్పని రెండు దెబ్బలు వేసేను!" అన్నాడు సుందర్రావు.

"నాకు తెల్సులేవయ్యోవ్ అసలు కార్నం! గంగరాజుకి ఎతిరేకంగా పన్జేసేనని




ఆయనే ఇట్టా సెయ్యమని సెప్పుంటాడు. పంతులూ, నే నెవర్నో తెలుసా? పంచా యితీ నెంబర్ని! సిమ్మాద్రి బాబుగోరి పేనాన్ని! తల్సుకుంటే సిటికెలో బదలా యింపై పోతావ్! కూసంత మడుసుల్ని సూసి మసులుకో! ఇంకోసారి మావా డొంటిమీద సెయ్యేడిందా... ...ఆఁ... ... జాగరత! నీ మరేద సెల్లు!" అన్నాడు నర్సిగాడు!

"బావా! ఏంట్రా ఆ మాటలు? పెద్దా సిన్నా లేకండా? పిల్లల మంచికోసవేఁ గదంట్రా పంతులుగోరు సెయ్యిసేసు కునేది? దీనికోసమని మరేద లేకండా నోటి కొచ్చినట్టు పేల్తా వేంట్రా?" అన్నాడు కోపాన్ని దిగమింగుతూ, సాధ్యమైనంత మృదువుగా; పోలయ్య.

"ఎల్లరా ఎదవా! రేపు ఎలచ్చన్లో నా కెతిరేకంగా నిలబడ్తావంటగా! బందుగు నన్న మ రే ద నీ కెక్కడేడిసిందిరా! అవున్లే.... గంగరాజు ఎంగిలి మెతుకులు ఒంటపట్టినియ్ బాగా!" అంటూ పోలయ్యని ఈసడిస్తూ, తూలుతూ పోయేడు నర్సిగాడు.

నర్సిగాడి దురుసుతనానికి పోలయ్య కుంగిపోయేడు. సిగ్గుపడ్డాడు. మొన్న మొన్నటివరకూ మాట్లాడ్డం చేతగాని నర్సి గాడు తన కొచ్చిన ముండమోపి 'పదవి' చూసుకునేగా ఇంత మిడిసిపడుతున్నాడు అనుకున్నాడు పోలయ్య. సుందర్రావు మొహంలోకి చూళ్లేక, "శలవు బాబూ!" అంటూ య జ మా ని యింటికి సాగి పోయేడు.

దూరం నుంచే పోలయ్య రావటం చూసి గంగరాజు కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్ళి ఎవో కాగితాలు పట్టుకొచ్చి, మళ్ళీ కుర్చీలో కూచున్నాడు.

"దం డా లం డ య్యా!" అన్నాడు పోలయ్య!

"నీ కోసమే చూస్తున్నాన్రా పోలయ్యా! ఇంత ఆలస్యమయిందేం?" అన్నాడు గంగరాజు!

"పంతులుగోరితో మాట్టాడతా ఉన్నానండయ్యా!" అన్నాడు పోలయ్య నొచ్చుకుంటూ!

"సర్లేరా! ఈ కాగితాలమీద సంతకాలు చెయ్యి! మిగతా పనంతా నేను చూసుకుంటాను! అదేవిట్రా అలా తెల్లబోతావ్! నామినేషన్ కాగితాల్లే! కంగారుపడకు!" అన్నాడు గంగరాజు చాలా హుషారుగా!

పోలయ్య నిశ్శబ్దంగా వుండిపోయేడు క్షణకాలం!

"నేనీ ఎలచ్చన్లో నుంచోనండయ్యా! ఛమించండి!" అన్నాడు దృఢంగా!

గంగరాజు తలమీద పిడుగుపడ్డట్లయింది. పోలయ్యవైపు నిప్పులు కురిపిస్తూ చూసి, "ఎందుకనిరా?" అన్నాడు కోపంగా.

"దేశంలో సదువుకున్నోల్లు, తెలివైనోల్లు, అన్నీ తెలిసినోల్లు లచ్చలున్నారండయ్యా! రెక్కలమ్ముకు బతికేవోణ్ణి! గొడ్డెదవని! నా కెంతుకండయ్యా ఈ పదవులు! ఏల్డవేం శాతవుద్దండి నాకు? పదవెక్కినోళ్ళు మంచి మర్సిపోయి రాచ్చసులై పోతారండయ్యా! మంచీ, మరేదా, నీతీ, నిజాయితీ లేకపోయేక మడిసి బతికినా, సచ్చినా ఒకటేనండయ్యా! అందుకు మా నర్సిగోడే సాచ్చికం! నేన్నుంచోనండయ్యా!" అన్నాడు పోలయ్య నిష్కర్షగా!

గంగరాజు కోపం తారామండలమంటింది.

"ఊరంతా తెలిసిపోయేక.... ఇప్పుడు నువ్వు కాదంటే నా పరువేం గావాల్రా?" అని గర్జించేడు.

"ఛమించండయ్యా! తవుఁరేవఁన్నా నేనీ రొంపిలో దిగలేనండయ్యా!" అన్నాడు పోలయ్యా!

"నువ్వు నా పాలేరువిరా!" అన్నాడు గంగరాజు.


"అవునండయ్యా! పేదోణ్ణి కూడా. అందుకే మీ కచ్చలకీ, కాయేసాలకీ నన్ను వాడుకుందావఁని సూస్తున్నారండయ్యా! మీ యవారాలు సక్కబడినాక మా మొకం సూడ్రు! మా బాదలగురుంచే ఆలోచించరు. నా కొద్దండీ బాబూ! ముమ్మాటికీ ఒద్దు!" అన్నాడు పోలయ్య.

"నా మోచేతి నీళ్ళు తాగే కుక్కవిరా నువ్వు! నాకే యెదురు చెపుతావురా, బద్మాష్!" అనరిచేడు గంగరాజు.

"తిట్టమాకండయ్యా! నేనూ మడిసినే!"

"ఛీ నోర్ముయ్! ఈ రోజునుంచీ నా గడప తొక్కితే కాళ్ళిరగ్గొడతాను."

"అలాగే లెండయ్యా! లెక్కలు సూసుంచండి. నాకు రావల్సింది నాకు పారేస్తే పట్టుకుపోతాను మద్దినేలొచ్చి. రెక్కలమ్ముకు బతికే గొడ్డెదవని. ఒకూరు




కాయం కాదండయ్యా! అన్నాల్లూ నాయే. ఈ వూల్లో నేనేం కట్టుకుపోవాలండీ? కట్టుకుపోవాలనుకున్నోళ్ళు నీతి తప్పి సిగ్గుమాలినోల్లవుతారు. ఆ ఎదవబతుకు నేను బతకలేనండి!" అంటూ కదిలేడు పోలయ్య.

—ఇంటికెళ్ళి సామాన్లు సర్దెయ్యమని లచ్చితో చెప్పాలి. పంతులుగారితో కొండూ రెళ్ళిపోవాలి. మంచి వాళ్ళ మధ్య మంచిగా బతకవచ్చు—అనుకుంటూ వేగంగా నడిచి పోయేడు. గత రాత్రినుంచీ పెరుగుతున్న గుండెబరువు పూర్తిగా అదృశ్యమై పోయింది.

'ఈ అలగా వెధవకి నీతా? స్వామి ద్రోహి! మాటిచ్చి తప్పిపోయిన ఈ అవినీతి పరుడు మనిషట, మనిషి! వీడూ ఒక మనిషేనా?' అనుకున్నాడు గంగరాజు.

పరాభవాగ్ని నిలూనా దహిస్తుంటే, దాన్ని చల్లార్చుకునే శక్తిలేక—మాజీ పంచాయితీబోర్డు ప్రెసిడెంటు గంగరాజు దిగాలుపడి కూర్చుండి పోయేడు.

---